ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం | 28 జనవరి, 2026 | పేజీలు :06

# విద్యార్థినులకు కలెక్టర్ పాఠాలు



ప్రజాపక్షం/బోధన్ : బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. సిబ్బంది అటెండెన్స్ రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. విద్యార్థులకు నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని నిర్వహకులను ఆదేశించారు. పాఠశాల పరిసరాలు నిశితంగా పరిశీలించిన కలెక్టర్, బాలికల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థినులను వారి తల్లిదండ్రులు వస్తేనే వారి వెంట ఇంటికి పంపాలన్నారు. అంతకుముందు 8వ తరగతి క్లాస్ రూంను కలెక్టర్ సందర్శించి, విద్యార్థినులకు పాఠాలు బోధించి వారి సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన చాక్లెట్లు అందించారు. చక్కగా చదువుకోవాలని, అదే సమయంలో వ్యక్తిగత భద్రత విషయంలో ఏమరుపాటుగా ఉండకుండా అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. పాఠశాలకు అవసరమైన విద్యుత్ వైరింగ్ సరిచేయించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. వంటగది, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ వికాస్ మహాతో, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ఎంఈఓ నాగయ్య, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హిమబిందు తదితరులు ఉన్నారు.

# పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

ప్రజాపక్షం/నస్పూర్ : రాష్ట్రంలో పారదర్శకమైన మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి శివధర్ రెడ్డిలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుండి ప్రవర్తన నియమావళి పక్కాగా అమలులో ఉంటుందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ, పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది నియామకం, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి ప్రతి అంశంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేయాలని, ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి కుమార్ దీపక్ మాట్లాడుతూ తరువాయి 2లో




రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని




# సంక్షేమానికి పట్టం కట్టండి

**సిరిసిల్ల పట్టణంలో ఆసాముల సమన్వయ సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : అభివృద్ధి సంక్షేమానికి పట్టం కట్టాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలో సిరిసిల్ల ఆసాముల సమన్వయ కమిటీ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం జరగబోయే మున్సిపల్ ఎన్నికలలో సిరిసిల్ల పట్టణంలోని అత్యధిక వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం వస్త్ర పరిశ్రమకు చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల మీ మద్దతును అందించి ఆశీర్వదించాలన్నారు. సిరిసిల్లలో మూఢంచలుగా ఉన్న వస్త్ర పరిశ్రమకు పని కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిన దరిమిలా, గత ప్రభుత్వం వస్త్ర పరిశ్రమకు పెట్టిపోయిన బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించిందన్నారు. గత ప్రభుత్వంలో యువరాజుగా వెలుగొంది సిరిసిల్ల ప్రజల కోసం తన చర్మం వలసి చెప్పులు కుట్టించినా తక్కువేనని చెప్పి ఎమ్మెల్యేగా గెలిచి వస్త్ర పరిశ్రమకు ఎలాంటి లాభం చెయ్యలేదన్నారు. వస్త్ర పరిశ్రమకు పెట్టిన బకాయిలు 300 కోట్లపై చిలుకు బాకీలను ప్రజా ప్రభుత్వం తీర్చిందన్నారు. కేసీఆర్ పాలనలో 75 వేల కోట్ల అప్పుల నుంచి 2023 వరకు 8 లక్షల కోట్ల అప్పును చేసి రాష్ట్ర ఖజానాని లూటీ చేశారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పగ్గాలు చేపట్టాక వస్త్ర పరిశ్రమకు పని కల్పించి కోటి చీరలకు ఆర్డర్లు ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న ఇందిరమ్మ చీరలను సిరిసిల్లలో తయారు చేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్

# ఎన్నికలు పకడ్బందీగా నిర్వహిస్తాం

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. రాష్ట్రంలో రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి షెడ్యూల్ విడుదలైనందున, మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిలతో కలిసి పాత్రికేయులు సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలో మొత్తం నిర్మల్, భైంసా, ఖానాపూర్, మూడు మున్సిపాలిటీలలో, 244 పోలింగ్ కేంద్రాల్లో, 180 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనన్నట్లు వెల్లడించారు. ఆర్వోలు, ఏఆర్వోలు, ఇతర అధికారుల విధులకు సంబంధించిఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. నేడు ఉదయం 10 గంటల 30 నిమిషాల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ 30వ తేదీ, సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందని వివరించారు. నేటి నుంచే వార్డుల వారిగా ఎలక్టరోల్స్ ప్రదర్శించబడతాయని తెలిపారు. ఈనెల 31వ తేదీన నామినేషన్ల పరిశీలన పూర్తి చేయడంతో పాటు, చెల్లుబాటు అయ్యే నామినేషన్ల జాబితాను ప్రదర్శిస్తామని అన్నారు. ఫిబ్రవరి 11వ తేదీన ఎన్నికలు నిర్వహించి,13వ తేదీన తరువాయి 2లో

# ట్రినిటి ఇంజినీరింగ్ కాలేజీలో ఫ్రెషర్స్ డే వేడుకలు




ప్రజాపక్షం/కరీంనగర్ : బొమ్మకల్‌లోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు అలోహ పేరుతో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి హాజరై నూతనంగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులను ఉద్దేశించి భవిష్యత్తులో కోర్సు పూర్తయ్యేసరికి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని, భవిష్యత్తులో ప్రపంచంలో అగ్రగామిగా ఆర్థిక శక్తిగా ఎదగడానికి వికసిత భారత లక్ష్యంగా తెలంగాణ రైసింగ్ రాష్ట్ర ప్రభుత్వ విజయం దిశగా ఉద్యోగాలు చేయడం కాకుండా ఉద్యోగాలను సృష్టించే దిశగా తరువాయి 2లో

## సంక్షేమానికి పట్టం కట్టండి

(మొదటి పేజీ తరువాయి)
, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, నియోజకవర్గ ఇంచార్జి కేకే మహేందర్, చొప్పదండి ప్రకాష్, వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి, గడ్డం నరసయ్య, కాముని వనిత నళినీ కాంత్, వెంగళ లక్ష్మీ నరసయ్య పాల్గొన్నారు.


## పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)
జిల్లాలోని మంచిర్యాల కార్పొరేషన్ సహా బెల్లంపల్లి, చెన్నూర్, క్యాతనపల్లి, లక్షెట్టిపేట మున్సిపాలిటీల్లో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రిటర్నింగ్ అధికారుల నియామకం, సిబ్బంది శిక్షణ, స్ట్రాంగ్ రూమ్ ల ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. అధికారుల సమన్వయంతో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ట్రినిటి ఇంజినీరింగ్ కాలేజీలో ఫ్రెషర్స్ డే వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)
కమ్యూనికేషన్ స్కిల్స్ షేరింగ్ ద ఐడియాస్ ఇన్నోవేషన్ దిశగా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. కళాశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఈ కళాశాలలో చదివిన ఎంబిఏ విద్యార్థి సైనా తహసీనకు జెఎన్టియు గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయం. కళాశాల పక్షాన శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఉత్తమ ప్రతిభ కనబరచాలని విద్యార్థులను ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేంద్ర సింగ్, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.రాజగోపాల్, ఏవో రాజశేఖర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పి కిషోర్, ఎంబీఏ విభాగపు అధిపతి, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, హెచ్ఓడిలు, అధ్యాపకులు డాక్టర్ జి.సంతోషి, డి.రజిత రెడ్డి, మహమ్మద్ ఇలియాస్ అలీ, మహమ్మద్ అజారుద్దీన్, సుప్రియ పాల్గొన్నారు.

## నూతన నియామకం



**ప్రజాపక్షం/ కరీంనగర్‌టౌన్ :** కరీంనగర్ ఫార్మా మేనేజర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జారతి మధు మోహన్ నియమితులయ్యారు. అదేవిధంగా జనరల్ సెక్రటరీగా బొద్దుల దయానంద్, ట్రెజరర్‌గా తోడేటి సంతోష్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జారతి శ్రీకర్, జాయింట్ సెక్రటరీగా అర్ర హరీష్‌బాబు, ఎన్.హరీష్‌ను వైస్ ప్రెసిడెంట్‌లుగా కక్కర్ల సంపత్, పూర్ణ చందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా షేక్ అన్వర్ హుస్సేన్, ముఖ్య సలహాదారుడిగా ఆది రాజు, ఒంటెల మైపాల్‌రెడ్డి, నాగార్జున, సాగర్, 11 మంది బోర్డు మెంబర్లను ఎన్నుకున్నారు.

# ఎన్నికలు పకడ్బందీగా నిర్వహిస్తాం

(మొదటి పేజీ తరువాయి)
ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు.ఎఫ్.ఎస్.టీ,ఎస్ఎస్టి బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు.మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు పెద్ద ఎత్తున తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. నామినేషన్ల ప్రక్రియ స్వీకరణ మొదలుకొని, పోలింగ్ ప్రక్రియ ముగిసేంతవరకు అవసరమైన పోలీసు బందోబస్తు కల్పిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పకుండా పాటించాలని అన్నారు. లైసెన్సు గల ఆయుధాలు కలిగిన వ్యక్తులు, వెంటనే తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించాలని వివరించారు. సరియైన పత్రాలు లేనిదే అనుమతికి మించి నగదు వెంట తీసుకెళ్లడం నిషేధమని అన్నారు. అక్రమ మద్యం, నగదుపై నియంత్రణ ఉంచుతామని తెలిపారు. ఈ పాత్రికేయుల సమావేశంలో అదనపు కలెక్టర్‌లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, బైంసా ఏఎస్పీ రాజేష్ మీనా, బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డీపీఆర్ఓ విష్ణువర్ధన్, నిర్మల్, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్‌లు జగదీశ్వర్ గౌడ్, సుందర్ సింగ్, పలువురు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను పాటించాలి

### గంగాధర ఎస్సై వంశీకృష్ణ



**ప్రజాపక్షం/గంగాధర:** గంగాధరలోని ఎంపిడివో కార్యాలయంలో రోడ్ సేఫ్టీపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో స్థానిక ఎస్సై వంశీకృష్ణ అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు అధికంగా జరగడానికి ప్రధాన కారణం ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడమేనని తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాల్సిన బాధ్యత ఉందన్నారు. ద్విచక్రవాహనదారులు నడిపే వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల తీవ్ర ప్రాణ నష్టం సంభవించే అవకాశాలున్నాయని హెచ్చరించారు. అధిక వేగంతో వాహనాలు నడకపకుండా వేగ నియంత్రణ పాటించాలన్నారు. వాహనం నడుపుతున్న సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించకూడదని తెలిపారు. కార్యక్రమంలో మండల ఎంపిడివో, అధికారులు, గ్రామ సర్పంచులు, ప్రజలు, యువకులు పాల్గొన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తామని, ఇతరులకు అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

# మున్సిపల్ ఎన్నికల్లో విజయ సంకల్పంతో పని చేయండి

### మాజీ మంత్రి పెద్ది రెడ్డి



**ప్రజాపక్షం/ వేములవాడ టౌన్:** మున్సిపల్ ఎన్నికల విజయమే లక్ష్యంగా విజయ సంకల్ప సమావేశం వేములవాడ పట్టణంలో మంగళ వారం భాజపా పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి ఇనుగుల పెద్దిరెడ్డి, వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా పెద్ది రెడ్డి, డాక్టర్ చెన్నమనేని వికాస్ రావులు మాట్లాడుతూ, వేములవాడ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజల ఆశీర్వాదంతో మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ జెండాను ఎగురవేస్తామని పేర్కొన్నారు. మాజీ మంత్రి పెద్ది రెడ్డి మాట్లాడుతూ, కార్యకర్తలే పార్టీకి బలం అని, ప్రతి ఒక్కరూ ఎన్నికలను సవాలుగా తీసుకుని విజయానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం వేములవాడ 13వ వార్డు కోనాయిపల్లికి చెందిన ఏరేళ్ల శ్రీలత సుదర్శన్, మహిళలు పెద్ది రెడ్డి, చెన్నమనేని వికాస్ రావు, జిల్లా అధ్యక్షుడు రెడ్డిబోయిన గోపి ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ బీజేపీలో అధికారికంగా చేరారు. ఈ సందర్భంగా శ్రీలత సుదర్శన్ లకు పార్టీ కండువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు. బీజేపీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోందని నాయకులు పేర్కొన్నారు. ఈ చేరికతో వేములవాడ పట్టణంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్, జిల్లా ఉప అధ్యక్షులు బండ మల్లేశం, జిల్లా ఉప అధ్యక్షులు సత్తయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, ఎస్సీ మోర్చ ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, ఎన్నికల కన్వీనర్ లింగంపల్లి శంకర్, జిల్లా ఎస్సీ మోర్చ అధ్యక్షులు సంటి మహేష్, కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్, కౌన్సిల్ మెంబర్లు కృష్ణ స్వామి, అల్లాడి రమేష్, సీనియర్ నాయకులు మల్లికార్జున్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నీటి సమస్యలను తీర్చిన సర్పంచ్



**ప్రజాపక్షం/ముధోల్ :** మండలంలోని అష్టా గ్రామ సర్పంచ్ సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు.గ్రామంలోని 8వ వార్డులో నీటి సమస్య ఉందని మహిళలు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లగా మంగళవారం బోరు మోటార్ ద్వారా అక్కడున్న బోరు బావిని ప్రెస్సింగ్ చేయించి నీరు వచ్చేలా సమస్యను వెనువెంటనే పరిష్కరించారు.దీంతో గ్రామస్తులు సర్పంచ్ చేస్తున్న సేవలను కొనియాడుతూ అభినందించారు.ఈ కార్యక్రమంలో వారితో పాటు ఉప సర్పంచ్ సురుగుల సావిత్ర కోటయ్య,లోలం మురళి, మిద్యా సురేష్, సాయిలు, బ్యాగరి జ్యోతి, చిన్నన్న,స్థానికులు పాల్గొన్నారు.



## రాజన్న ఆలయ అభివృద్ధి పనులు పరిశీలించిన మంత్రి

**ప్రజాపక్షం/వేములవాడ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ భీమేశ్వరాలయంలో స్వామి వారిని మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వేములవాడ పట్టణంలోని దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి విస్తరణ పనులను మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

## కొత్తపల్లిలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలి



### బిజెపి నాయకులు వాసాల రమేష్

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** కరీంనగర్ కార్పోరేషన్ పరిధిలోని కొత్తపల్లిలో ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలపాలని బిజెపి నాయకులు వాసాల రమేష్ డిమాండ్ చేశారు. గతంలో మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టి తీసుకుపోగా అధికారులను ఆదేశించినప్పటికీ బస్సులు ఆపడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులు ఆపకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రీజినల్ పరిధిలో కొత్తపల్లిలో బస్సులను ఆపాలని ఐదు జిల్లాలకు సంబంధించిన ఈడి స్పందించి కొత్తపల్లి పట్టణ కేంద్రంలో బస్సు ఆపాలని కోరారు. ప్రభుత్వం ఉచిత బస్సు పెట్టినప్పటికీ ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగక మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని, ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి బస్సులు నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మాజీ కౌన్సిలర్ స్వర్గం వజ్ర నర్సయ్య, చిట్కూరి శ్రీనివాస్, కారం రవి ప్రసాద్, బిజెపి నాయకులున్నారు.

## ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మె

### సిఐటియు నాయకులు కస్తూరి చంద్రశేఖర్

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. మంగవారం శ్రీరాంపూర్ జిఎం శ్రీనివాస్‌కు సిఐటియు బ్రాంచ్ నాయకులు కస్తూరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను మానుకోవాలని, కోల్ ఇండియా బొగ్గు బ్లాకులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించకూడదని స్పష్టం చేశారు. కమర్షియల్ మైనింగ్‌ను రద్దు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ వేతనాలు చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంస్థలను అమ్మివేయడం నీచమైన చర్య అని, ఈ విధానాలను అడ్డుకోవడానికి కార్మికులు, ఉద్యోగులు ఏకతాటిపైకి వచ్చి సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వ మొండి వైఖరికి ఈ సమ్మె ఒక హెచ్చరిక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు బానిష్, శ్రీనివాస్, కిషన్ రెడ్డి, సుధాకర్, శ్రీనివాస్, సంపత్ పాల్గొన్నారు.



# నిర్మల్‌లో ఘనంగా సిఎం కప్ క్రీడలు

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఈ నెల 29వ తేదీన నిర్మల్ అర్బన్ మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ క్రీడల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు ముందుగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, పోటీల రోజున తమ వెంట ఆధార్ కార్డ్ లేదా బోనఫైడ్ సర్టిఫికెట్లను తప్పనిసరిగా తీసుకురావాలని ఆయన సూచించారు.ఈ పోటీల్లో భాగంగా కబడ్డీ,కోకో,వాలీబాల్, అథ్లెటిక్స్, కరాటే, చెస్ వంటి వివిధ క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయని, పాల్గొనే వారు తమ ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుందని వెల్లడించారు. ఈ క్రీడలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం, రిజిస్ట్రేషన్ సందేహాల కోసం మండల ఇంచార్జ్ వన్నెల భూమన్న (పీడీ)ని 99 63198021 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చని ఆయన కోరారు. స్థానిక క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ప్రతిభను కమిషనర్ పిలుపునిచ్చారు.

# వృద్ధుడి ఆత్మహత్య



ప్రజాపక్షం/కౌటాల:ఒంటరితనాన్ని భరించలేక ఓ వృద్ధుడు విషం సేవించి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కౌటాల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మంగళవారం మండల కేంద్రంలోని సదాశివపేటకు చెందిన దెబ్బటి వెంకన్న (75) తన నివాసంలో విషం సేవించి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. వెంకన్న భార్య మూడేళ్ల క్రితం మరణించింది. అప్పటి నుండి ఆయన తీవ్ర ఒంటరితనంతో పాటు మానసిక వేదనతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై తన ఇంట్లోనే విషం సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడి కుమారుడు దెబ్బటి శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కౌటాల సబ్ ఇన్స్పెక్టర్ డి. చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వివరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# బగలాముఖి శక్తిపీఠంలో అమ్మవారికి హరిద్రార్చన..

ప్రజాపక్షం/శివ్వంపేట : మండల కేంద్రమైన శివ్వంపేటలోని శ్రీబగలాముఖి శక్తిపీఠంలో అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన మంగళవారం ఉదయం భక్తులు విశేషపూజలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉపాసకులు బ్రహ్మశ్రీ శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో శక్తిపీఠం ప్రధాన అర్చకులు కమలేష్ పండిత్, కపిల్‌జోషి చేతులమీదుగా అమ్మవారికి విశేష పూజలు చేశారు .అమ్మవారికి ప్రీతిపాత్రమైన పసుపుతో అర్చన నిర్వహించడమే కాకుండా అభిషేకం, మంగళ హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజిపేట వెంకటేశ్వర్, పిల్లుట్ల మాజీ ఉపసర్పంచ్ బుర్ర మహేష్‌గౌడ్, కాముని నగేష్, పత్రాలరామని మహేష్‌గుప్తా, బొద్దు నర్సింలు, పత్రాల రాజుగౌడ్, మంగలి ప్రకాశ్, వడ్ల బ్రహ్మచారి, వంజరి గణేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలు.. శాంతియుత నిర్వహణే ధ్యేయం



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో,జిల్లాలో ఎన్నికలను శాంతియుత,స్వేచ్ఛాయుత,పారదర్శక వాతావరణంలో నిర్వహించడమే పోలీస్ శాఖ ప్రధాన ధ్యేయమని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ స్పష్టం చేశారు.బుధవారం నుండి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న తరుణంలో,నామినేషన్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఆమె వెల్లడించారు.సమస్యాత్మక ప్రాంతాలను ఇప్పటికే గుర్తించి అక్కడ ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు,అదనపు బలగాలను,మొబైల్ పెట్రోలింగ్ బృందాలను రంగంలోకి దించుతున్నట్లు తెలిపారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి(మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమల్లోకి వచ్చినందున,రాజకీయ పార్టీలు,అభ్యర్థులు,ప్రజలు నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఎస్పీ సూచించారు.కోడ్ ముగిసే వరకు ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు,ధర్నాలు,రాస్తారోకోలు నిర్వహించడంపై పూర్తి నిషేధం ఉంటుందని,నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ముఖ్యంగా ఓటర్లను డబ్బు మద్యం లేదా ఇతర ప్రలోభాలకు గురిచేసే వారిపై ప్రత్యేక దృష్టి సారించామని,అక్రమ ఆయుధాల నివారణకు తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.లైసెన్స్ కలిగిన ఆయుధాలు ఉన్నవారు వాటిని వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లలో జమ చేయాలని ఆదేశించారు.సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు,విద్వేషపూరిత సందేశాలు లేదా ప్రజలను రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిపై సైబర్ చట్టాల ప్రకారం కఠినమైన కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు.శాంతిభద్రతలకు భంగం కలిగించే సమాచారం ఏదైనా ఉంటే ప్రజలు వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని కోరారు.ప్రజాస్వామ్య పండుగను విజయవంతం చేసేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని,ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# సమ్మక్క సారలమ్మ జాతరకు ఘన ఆరంభం



ప్రజాపక్షం/మందమర్రి:మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణ సమీపంలోని ఆర్కె 1 గని పరిసర ప్రాంతంలో నిర్వహించనున్న సమ్మక్క సారలమ్మ జాతరకు మంగళవారం ఘనమైన ఆధ్యాత్మిక ఆరంభం లభించింది. జాతరలో భాగంగా ఆర్కె 1ఎ గని సమీపంలో నిర్వహించిన పవిత్రమైన కంక వనం పూజా కార్యక్రమానికి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ నెల 28 నుండి 31 వరకు జరగనున్న ఈ జాతర సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల సంప్రదాయ ఆచారాల ప్రకారం సమ్మక్క పూజారులు పుణ్యక్షేత్రానికి కంక వనం (వెదురు కర్రలు) తీసుకు రావడం విశేషమని తెలిపారు. జాతర సమయంలో దేవతలను గద్దెలకు చేర్చే ప్రక్రియలో కంకవనాలు, కుంకుమ భరణితో కూడిన పూజలకు విశేష ప్రాధాన్యత ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సంప్రదాయాలు గిరిజన సంస్కృతికి, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ టు జిఎం జి.ఎల్. ప్రసాద్, ఏఐటియుసి మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, రామకృష్ణపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, డిజిఎం అశోక్, ఏరియా ఆఫీసర్ భూశంకరయ్య, డిజిఎం కిరణ్ కుమార్, ఉన్నతాధికారులు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

# ఆమ్ ఆద్మీ కౌన్సిలర్ అభ్యర్థుల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:తెలంగాణలో రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిర్మల్ జిల్లాలో రాజకీయ సందడి మొదలైంది.ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)తన ఎన్నికల కార్యకలాపాలను వేగవంతం చేస్తూ,నిర్మల్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కౌన్సిలర్ పదవుల కోసం ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఘనంగా ప్రారంభించింది.ఈ సందర్భంగా భైంసా పట్టణంలోని 20వ వార్డు నుండి హుజూర్ అలీ,22వ వార్డు నుండి మాలన్ బి.కౌన్సిలర్ అభ్యర్థులుగా తమ దరఖాస్తులను పార్టీ నాయకులకు సమర్పించారు.అరవింద్ కేజ్రీవాల్ సిద్ధాంతాలకు,పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి నమూనాకు ఆకర్షితులై,తమ వార్డులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో తాము పోటీలోకి దిగుతున్నట్లు అభ్యర్థులు





పేర్కొన్నారు.ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్,ముధోల్ నియోజకవర్గ ఇంచార్జి కాలేవార్ సూర్యనారాయణ,ముధోల్ నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ షేక్ జావేద్‌లు అభ్యర్థుల దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా సయ్యద్ హైదర్ మాట్లాడుతూ,సామాన్య ప్రజల నుండి వచ్చే నాయకులను ప్రోత్సహించడమే పార్టీ లక్ష్యమని,అవినీతి రహిత పాలన,వార్డు స్థాయి అభివృద్ధే తమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.నిర్మల్,భైంసా ప్రాంతాల నుండి పార్టీకి వస్తున్న స్పందన చూస్తుంటే ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అర్థమవుతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని అభ్యర్థులకు మద్దతు తెలిపారు.

# ప్రాణాలు తీసిన మద్యం మత్తు...

ప్రజాపక్షం/ముధోల్:మద్యం మత్తులో బస్సు నడుస్తున్నప్పుడు అజాగ్రత్తగా బస్సెక్కే క్రమంలో ఒక యువకుని ప్రాణాలు పోయాయి.మృతుని (సాహెబ్‌రావు)తల్లి తండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముధోల్ ఎస్సై బిట్ల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.బతుకు తెరువుకోసం పక్క రాష్ట్రమైన ధర్మాబాద్ నుండి మండలంలోని తరోడాలో కుటుంబ సమేతంగా ఇటుక బట్టిలో పనిచేస్తూ జీవనం గడపడానికి వచ్చారు.సోమవారం రేషన్ సరుకులు తీసుకురావడానికి తండ్రి ఆత్మారామ్,తల్లి ఇద్దరు కలిసి సాయంత్రం 5 గంటలకే ధర్మాబాద్ వెళ్ళారు.(మృతుడు)ఈయన కూడా ధర్మాబాద్ వెళ్ళాలని సాయంత్రం 7 గంటల సమయంలో బస్సు నడుస్తున్న సమయంలోనే మద్యం తాగి మత్తులో బస్సెక్కడానికి వెళ్లి కింద పడగా కుడివైపు నడుము భాగంలో బలమైన గాయం కావడంతో 108 ద్వారా చికిత్స కొరకు భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ రాత్రి 10గంటల సమయంలో మరణించినట్లు మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి




ప్రజాపక్షం/ఆసిఫాబాద్:మిషన్ భగీరథ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గ్రిడ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు నెలలుగా వేతనాలు చెల్లించాలని ఎల్ అండ్ టి యాజమాన్యాన్ని అడుగుతున్నా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఫలితంగా పండుగ పూట కార్మికులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనం 26,000 రూపాయలు చెల్లించాలని, ఇపిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలతో పాటు ఒక నెల జీతం బోనస్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పది లక్షల రూపాయల ఇన్సూరెన్స్ కల్పించాలని, ఇతర సమస్యలను పరిష్కరించకుంటే ఫిబ్రవరి 10వ తేదీ నుండి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు చిరంజీవి, యూనియన్ జిల్లా అధ్యక్షులు బాలేష్, ప్రధాన కార్యదర్శి షకీర్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంషద్, ఉపాధ్యక్షుడు పర్వేజ్, కోశాధికారి అంజి పాల్గొన్నారు.

# లారీ ఢీకొని ఒకరి మృతి.. ఇద్దరికి గాయాలు

ప్రజాపక్షం/హాజీపూర్:అతివేగంగా వచ్చిన గూడ్స్ క్యారియర్ వాహనం ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. మంగళవారం తెల్లవారుజామున మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం పరిధిలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం పాట్నా జిల్లా ఖుస్రూర్ గ్రామానికి చెందిన దేవ్ జీత్ కుమార్ (26) తన సహచరులు కేసిరెడ్డి రాంరెడ్డి, సింగం అరవింద్‌లతో కలిసి ఎలక్ట్రిక్ ఆటో ట్రాలీలో పాలు తీసుకొని అంతర్గాం నుండి మంచిర్యాలకు వస్తున్నారు. మార్గమధ్యలో మంచిర్యాల నుండి లక్షెట్టిపేట వైపు వెళ్తున్న అశోక్ లేలాండ్ గూడ్స్ క్యారియర్ వాహనం అతివేగంగా వచ్చి ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దేవ్ జీత్ కుమార్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రాంరెడ్డికి తీవ్ర గాయాలు కాగా, అరవింద్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. గాయపడిన రాంరెడ్డిని మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని తమ్ముడు సన్నీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హాజీపూర్ ఎస్ఐ కిరణ్ దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

# బోథ్ ఎంపిడిఒ టిఎంలకు ఘనంగా సన్మానం



ప్రజాపక్షం/బోథ్:బోథ్ మండల పరిధిలో ఉత్తమ అధికారులుగా గుర్తింపు పొంది,ప్రశంసా పత్రాలు అందుకున్న ఎంపీడీవో యల్.రమేష్, టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ) మధుకర్‌లను మంగళవారం ఉపాధి హామీ కూలీలు,వార్డు సభ్యులు కలిసి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాట్లాడుతూ తమ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ,ప్రజల మనసు గెలుచుకున్న ఈ అధికారులకు జిల్లా స్థాయిలో గుర్తింపు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి సహకరిస్తున్న అధికారులకు అవార్డులు రావడం గర్వకారణమని తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు బిట్లింగ్ ఉమగిరీష్,తో పాటు మైసమ్మ కాలనీకి చెందిన లక్ష్మి, ఉమ, జ్యోతి, ఛా యా,రజిత, గంగు,నాగరాజు,భాస్కర్ గంగామణి పాల్గొన్నారు.

## తాగు నీటి సమస్య పరిష్కరించిన సర్పంచ్

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మచ్చుపేట గ్రామంలో మంచినీటి పైపులైన్ డ్యామేజ్‌ని దగ్గర ఉండి మరమ్మతు చేయించిన సర్పంచ్ చిలివేరి జ్యోతిలక్ష్మణ్, వారివెంట వార్డు మెంబర్ మదాసి వనజ, నరేష్, సిరారపు కొమురయ్య, పోలుదాసారి గ్రామ పంచాయితి సిబ్బంది ప్రజలు తదితరులు హాజరయ్యారు. సర్పంచ్ చేసిన పనికి గ్రామ ప్రజలు, యువకులు హర్షం వ్యక్తం చేశారు.

## ఫిబ్రవరి 2,3న సిఎం కప్ క్రీడా పోటీలు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** ఈ నెల 28 నుంచి 30 తేదీ వరకు నిర్వహించాల్సిన మున్సిపాలిటీ, మండల స్థాయి సిఎం కప్ క్రీడా పోటీలు అనివార్య కారణాలవల్ల వాయిదా పడినట్లు మండల విద్యాశాఖ అధికారి రాజయ్య తెలిపారు. వాయిదా పడిన ఈ క్రీడా పోటీలను ఫిబ్రవరి 2, 3 తేదీలలో మున్సిపాలిటీ, మండల స్థాయిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సిఎం కప్ క్రీడా పోటీల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాల్సిందిగా మండల విద్యాశాఖ అధికారి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ఎస్‌జిఎఫ్ కార్యదర్శి ప్రణయ్, ఫిజికల్ డైరెక్టర్స్ ప్రసాద్, ఆసియా, సంధ్య, శ్రీవాణి, సరోజ, వెంకటేష్, సత్యం, శివ, అజ్జు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి చేయూత...



**ప్రజాపక్షం/వీర్నపల్లి :** మండల కేంద్రంలోని గర్జనపల్లి గ్రామానికి చెందిన కొయ్యేటి కనకవ్వ(50) అనే నిరుపేద మహిళా అనారోగ్యంతో ఇటీవల మరణించింది. కాగా మృతురాలి కుటుంబ సభ్యులను గ్రామ ఉపసర్పంచ్ న్యాత మోహన్ మంగళవారం పరామర్శించి, దయనీయ పరిస్థితిలో ఉన్న వారికి 50 కిలోల బియ్యంతో పాటు రెండువేల రూపాయాల నగదును అందించారు. మానవత్వాన్ని చాటుకున్న మోహన్‌ను గ్రామస్తులు అభినందించారు. వారి వెంట అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు గజ్జెల ప్రశాంత్, గౌరి రాజు, నగరపు దేవేందర్, చిన్నం నర్సయ్య, న్యాత రంజిత్, దుంపేట చంద్రయ్య, అబ్బనవేని శ్రావణ్, కుటుంబ సభ్యులు అనిల్, అజయ్ లు ఉన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

**ప్రజాపక్షం/ధర్మపురి :** త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం జగిత్యాల జిల్లా అదనపు ఎస్‌పి శేషాద్రిని రెడ్డి ధర్మపురి మున్సిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, సంస్కృతాంధ్ర కళాశాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.వెంట సిఐ రాంనరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, ఎస్‌ఐ మహేష్, సిబ్బంది ఉన్నా రు.

# ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

### అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** వచ్చే నెల ఫిబ్రవరి 25వ తేదీ నుంచి మార్చి 16 వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఛాంబర్‌లో అదనపు ఎస్పీ డి.చంద్రయ్యతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ప్రశ్నపత్రాలను పరీక్షా కేంద్రాలకు తరలించే సమయంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఇతరులు ఎవరూ కూడా పరీక్షా కేంద్రాల్లో ఉండరాదని, గుర్తింపు పొందిన వారిని తప్ప ఎవరినీ అనుమతించరాదని ఆదేశించారు. వేసవి దృష్ట్యా వైద్య శాఖ అధికారులు పరీక్షా కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ లను నియమించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట మహిళా పోలీస్ సిబ్బందికి డ్యూటీ కేటాయించాలని సూచించారు. కేంద్రాల్లో పరీక్ష రాసే వారికి అన్ని వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శరత్ కుమార్, వైద్య ఆరోగ్య, ఎలక్ట్రిసిటీ, రెవెన్యూ, పోస్టల్, ఇంటర్మీడియట్ విద్య, ఆర్టీసీ సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ

### విద్యార్థులు నేర్చుకోవడంలో ఒక నిరంతర ప్రక్రియతో ఆధునికరణ చెందాలి

### - కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ




**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్వయం ప్రతిపత్తి జగిత్యాల నందు తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ద్వారా 12 రోజుల సాఫ్ట్ స్కిల్స్, ఏఐ స్కిల్స్‌పై ట్రైనింగ్‌ను మంగళవారం నిర్వహించగా కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ, నాలెడ్జ్ సెంటర్ కోఆర్డినేటర్ జి.నీరజ, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డా.సంగీత రాణి, ట్రైనర్స్ పూర్ణ, బాలమురళీ కృష్ణ పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ మాట్లాడుతూ ఈ కాలంలో మనం నేర్చుకున్న నైపుణ్యాల వల్ల సమాజం మన సేవను గుర్తించే స్థితికి చేరుకోవాలని, నేర్చుకోవడం అనేది ఒక నిరంతర ప్రక్రియ కాబట్టి జీవితాంతం ఉత్సాహంగా నేర్చుకుంటూ ఎప్పటికప్పుడు ఆధునికరణ చెందాలని విద్యార్థులను ప్రోత్సాహపరిచారు. తెలంగాణ స్కిల్, నాలెడ్జ్ సెంటర్ కోఆర్డినేటర్ జి.నీరజ మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా అవసరమైన నైపుణ్యాలను సమకూర్చుకొని ఉద్యోగ అవకాశాలను పెంచుకోవచ్చు అని కోఆర్డినేటర్ జి.నీరజ తెలిపారు. స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డా.సంగీత రాణి మాట్లాడుతూ ఉద్యోగార్థులను ఇంటర్వ్యూలో ఒత్తిడికి గురి చేసినప్పుడు వాటిని ఎదుర్కొనే నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటేనే విజయం సాధిస్తారని దానికొరకు విద్యార్థులు ప్రత్యేక కృషి పట్టుదలతో ఉండాలని సెక్రటరీ డా.సంగీత తెలిపారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ట్రైనర్స్ పూర్ణ, బాలమురళీకృష్ణ మాట్లాడుతూ సాఫ్ట్‌స్కిల్స్‌లో కమ్యూనికేషన్స్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, ప్రాబ్లమ్స్ సాల్వింగ్ స్కిల్స్, టీం వర్క్, టైం మేనేజ్మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ స్కిల్స్ లో ఫండమెంటల్స్ ఆఫ్ ఏఐ, మిషన్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ మొదలగునవి అందించడం జరుగుతుందని బాలమురళీ కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.చంద్రయ్య, మెంటర్ జి.తిరుపతి, డాక్టర్ వరప్రసాద్, రామచంద్రం, డాక్టర్ జి.శ్రీలత, డాక్టర్ సుజాత, మల్లికార్జున్, జమున, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

# నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభించిన సెస్ డైరెక్టర్ పొన్నాల

**ప్రజాపక్షం/చందుర్తి :** మండలంలోని మూడు గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన రెండు నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఆయా గ్రామాల సర్పంచులతో కలిసి మంగళవారం ప్రారంభించినట్లు చందుర్తి సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తిమ్మాపూర్, ఆశిరెడ్డిపల్లి, నర్సింగాపూర్ గ్రామాల పరిధిలో లో ఓల్టేజ్ సమస్యల పరిష్కారానికి నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. సెస్ చైర్మన్ చిక్కాల రామరావు, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో మండలంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు కాపిల్ల శంకర్, బొజ్జ మల్లేశం, మరాఠి మల్లిక్, ఉప సర్పంచ్‌లు పూదూరి జీవన్ రెడ్డి , మూల మహేందర్, ఎడ్ల హరీష్, సెస్ ఎడి గంగాధర్, ఎఇ మహేష్, లైన్‌మెన్ తులసీరామ్, సిబ్బంది శంకరయ్య, కనుకయ్య, శివ ప్రసాద్, నాయకులు ముద్రకోల వెంకటేశం, రామిడి మల్లయ్య, కాపిల్ల స్వామి, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



## పాలనలో తనదైన ముద్ర

**ప్రజాపక్షం/నేరడిగొండ :** పీచర గ్రామ పంచాయితీలో నెలకొని ఉన్న సమస్యలను సర్పంచ్ బైరి లింగవ్వ రాజేందర్, ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ పాలనలో తనదైన ముద్ర వేసుకుంటున్నారని గ్రామస్తులు అంటున్నారు. తన మార్కు పాలనతో కనీస అవసరాలు తీర్చడమే గ్రామ అభివృద్ధిగా ప్రతి సమస్యకు పరిష్కరం చూపుతూ చీకటిలో ఉన్న గ్రామానికి వీధి దీపాలు,మురికి కాలువల అభివృద్ధి తదితర పనులు చేస్తున్నారని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా సర్పంచిని గ్రామస్తులు అభినందించారు.

## సిఎం కప్ క్రీడలు

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సిఎం కప్ మండల స్థాయి క్రీడలు నేడు బుధవారం రోజు నుండి ప్రారంభమవుతున్నాయని, విద్యాశాఖ అధికారి దామోదర్ రెడి మంగళవారం తెలిపారు. నేడు బాలికలకు, మహిళలకు, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని, రేపు పురుషులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీలు ఉంటాయని, 30వ తారీకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించబడతాయని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో నిర్వహించబడతాయని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర బాధ్యుల ఎంపిక



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర బాధ్యులుగా దుగ్యాల శ్రీనివాసరావు, దామరపల్లి జయపాల్ రెడ్డి లు ఎన్నుకోబడ్డారు. ఇటీవల హైదరాబాద్ కేశవ విద్యాలయంలో జరిగిన తపస్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలలో పెద్దపెల్లి జిల్లా నుండి దుగ్యాల శ్రీనివాసరావు, దామరపల్లి జయపాల్ రెడ్డి ఎలగం కనకయ్య,రాజేశ్వరరావు లు రాష్ట్ర కార్య వర్గములో ఎంపిక కాబడినారు.ఈ సందర్భంగా వారు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసినారు. ఈ సందర్భంగ రాష్ట్ర బాధ్యులు మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న డి.ఏ. లను ,పి.ఆర్సి , పెండింగ్ బిల్లులను, హెల్త్ కార్డులను వెంటనే ప్రభుత్వం విడుదల చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వమును కోరారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** తనతో పాటు చదువుకున్న తోటి మిత్రుడు మృతి చెందడంతో చలించిపోయారు పూర్వ విద్యార్థులు నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలనుకున్నారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన జనుప శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. తమ మధ్య స్నేహితుడు లేకపోయినా మానవత్వ దృక్పథంతో స్నేహితుని కుటుంబానికి స్నేహితులందరూ అండగా నిలిచారు. 2005–06 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితులందరూ కలిసి ఆర్థిక సహాయం అందజేశారు. రూ.2 లక్షల 2 వేల ఆర్థిక సహాయాన్ని ఆయన సతీమణి (భార్య) సునీత కు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ సి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఎల్పుల రాము,నేరెళ్ల మహేష్ ,చెవుల మద్ది తిరుపతి ,నేరెళ్ల మునేందర్ ,గుండా గంగాధర్ ,సంతోష్, మజీద్ ,తదితరులు పాల్గొన్నారు.

## మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా నరసయ్య



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మల్లాపూర్ మండల రేషన్ డీలర్ల సమావేశాన్ని ఓబులాపూర్ గ్రామంలో ఏర్పాటుచేసి నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ఈ మేరకు రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడిగా గుండంపల్లి రేషన్ డీలర్ దప్పుల నరసయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా ముద్దం ప్రకాష్ ఉపాధ్యక్షురాలుగా ఇస్లావత్ విజయ, కోశాధికారిగా కళ్లెం లలిత,ప్రధాన కార్యదర్శిగా గుండు మహిపాల్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. తమపై నమ్మకం ఉంచి తమ ఎన్నికకు సహకరించిన మండల రేషన్ డీలర్లకు నూ తన కార్యవర్గ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి సహా య సహకారాలు అందిస్తానని నూతన అధ్యక్షుడు దప్పుల నరసయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రేషన్ డీలర్స్ ఉన్నారు.

## బిటి రోడ్డు నిర్మాణానికి మిషన్ భగీరథ పైపుల ధ్వంసం..



**ప్రజాపక్షం/నేరడిగొండ:**నేరడిగొండ మండలంలోని గాజిలి,గాంధారి,కి వెళ్లే మార్గంలో ఐటీడీఏ ద్వారా మంజూరైన బిటి రోడ్డు పనులు జరుపుతున్న కాంట్రాక్టర్ జెసిబి ఎర్త్ మూవర్స్ పనులను కొనసాగిస్తున్న సందర్భంలో మిషన్ భగీరథ పైప్ లైన్లు ఎక్కడికక్కడ ధ్వంసమై గత నెల నుండి ఆయా గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయి నానా అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.అసలే ప్రభుత్వ పథకాలకు అందకుండా ఉన్న గ్రామాలకు ఇప్పుడిప్పుడే రోడ్డు మార్గం అవుతున్న సందర్భంలో ఒక పని మంజూరు అయితే ఇంకో పని ధ్వంసం అవడం చుస్తే ఈ సమస్యను ఎవరు పరిష్కారం చేస్తారో తెలియడం లేదని అన్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ పైపులను కాంట్రాక్టర్ ద్వారా అయినా లేదంటే మిషన్ భగీరథ అధికారులైన బిగించి నీటి సరఫర చేయాలని కోరుతున్నారు.

## ఉత్తమ ఉద్యోగులకు సన్మానం..



**ప్రజాపక్షం/ఖానాపూర్:**ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైనా ఖానాపూర్ మండల ఇపంచాయతీ ఆపరేటర్ సాగర్,వీబీజీరామ్ జీ ఆపరేటర్ హరీష్ గౌడ్‌లు నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందుకున్నారు.ఈ సందర్భంగా ఖానాపూర్ ఎంపీడీవో రమాకాంత్,ఎంపీవో చిక్యాల రత్నాకర్ రావులు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇపంచాయతీ ఆపరేటర్ సాగర్,హరీష్ గౌడ్ లను శాలువాలతో సన్మానించారు.వారి సేవలకు ఉత్తమ ఉద్యోగులుగా కావడం అభినందనీయమని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుపరిండెంటెంట్ స్వామి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఫోటో 27 నిర్మల్ 09

## రేపు మండల స్థాయి సిఎం కప్ పోటీలు..

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్:** తెలంగాణ ప్రభుత్వం గ్రామాలలోని యువతి,యువకుల క్రీడ నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సీఎం కప్ పోటిలను నిర్వహించాడం జరుగుతుంది.సీఎం కప్ క్లస్టర్ స్థాయి పోటీలలో విజయం సాధించిన క్రీడాకారులు ఈ నెల 29,30 తేదీలలో మండల స్థాయి పోటీలు నిర్వహించడం జరుగుతుందని క్రీడాకారులు న్యూ లోలం గ్రామంలోని లిటిల్ స్కాలర్ హై స్కూల్ ప్రాంగణంలో 9 గంటలకు పోటీలు నిర్వహించడం జరుగుతుందని క్రీడాకారులు సకాలంలో వచ్చి క్రీడలలో పాల్గొనాలని,మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు డివిజన్ స్థాయి పోటీలను పంపడం జరుగుతుందని ఎంపీడీవో అరుణ రాణి,పిడి అంబాజీ తెలిపారు.

## వన్యప్రాణి-మానవ సంఘర్షణపై ప్రాంతీయ స్థాయి అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :**అటవీ ప్రాంతాలకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో వన్యప్రాణుల వల్ల మానవులకు ఎదురవుతున్న సవాళ్లు,వాటి పరిష్కార మార్గాలపై నిర్మల్ జిల్లా కేంద్రంలో ప్రాంతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు.బాసర సర్కిల్ చీఫ్ప కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శర్వానన్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సదస్సుకు నిర్మల్, ఆదిలాబాద్‌ద, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల నుంచి వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు భారీగా తరలివచ్చారు.అటవీ సరిహద్దు గ్రామాల్లో వన్యప్రాణుల సంచారం వల్ల ఏర్పడే సంఘర్షణలను ఎలా ఎదుర్కొవాలి, ప్రాణ, ఆస్తి నష్టాలను ఎలా నివారించాలనే అంశాలపై ఈ సందర్భంగా లోతైన చర్చలు జరిగాయి.అ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా అటవీ అధికారి సుశాంత్ సుఖ్దేవ్ బోబడే,ఆదిలాబాద్ డి.ఎఫ్.ఓ ప్రశాంత్ పాటిల్,జగిత్యాల డి.ఎఫ్.ఓ రవి ప్రసాద్,నిర్మల డి.ఆర్.డి.ఏ పీడీ విజయలక్ష్మి పాల్గొ






న్నారు.అటవీ గ్రామాల్లో ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులపై ప్రజాప్రతినిధులు అందించిన సలహాలు, సూచనలను అధిఒకారులు స్వీకరించారు.ముఖ్యంగా వన్యప్రాణుల రక్షణతో పాటు మానవ భద్రతను పెంపొందించేందుకు విద్యుత్, వ్యవసాయ, రెవెన్యూ, వెటర్నరీ శాఖలు అటవీ శాఖతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని నిర్ణయించారు.ఈ సదస్సులో వరల్డ్ వైడ్ లైఫ్ ఫండ్(డబ్ల్యూ,డబ్ల్యూ,ఎఫ్) తెలంగాణ డైరెక్టర్ ఫరీదా తంపాల్, వివిధ జిల్లాల ట్రైబల్ వెల్ఫేర్,హార్టికల్చర్ అధికారులు, ఎలక్ట్రిసిటీ, అగ్రికల్చర్ అధికారులు పాల్గొన్నారు. అలాగే అటవీ మండలాధికారులు నాగిని భాను,చిన్నా,శివ కుమార్,హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సోసైటీ ప్రతినిధులు,అరణ్య ఎన్జీవో సభ్యులు,సర్పంచులు,అటవీ క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొని వన్యప్రాణిమానవ సంఘర్షణను తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

## కార్మిక హక్కుల సాధనలో టిబిజికెఎప్ పాత్ర చిరస్మరణీయం

**ప్రజాపక్షం/కాసిపేట:**కార్మిక హక్కుల సాధనలో టిటిబిజికెఎస్ యూనియన్ పాత్ర చిరస్మరణీయమని ఆ సంఘం నాయకుడు కారుకూరి తిరుపతి అన్నారు. మంగళవారం కాసిపేట 2 గనిపై యూనియన్ 24వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీనియర్ నాయకులు పోషం, ప్రభాకర్ చేతుల మీదుగా యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ 2014లో టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెండింగ్‌లో ఉన్న 3400 మందికి ఒకేసారి ఉద్యోగాలు కల్పించిన ఘనత టిబిజికెఎస్ యూనియన్‌దేనని తెలిపారు. 1998లో జాతీయ సంఘాలు రద్దు చేసిన డిపెండెంట్ ఉద్యోగాలను 2017లో కారుణ్య నియామకాలుగా తిరిగి తీసుకువచ్చామని పేర్కొన్నారు. మ్యాచింగ్ గ్రాంట్, తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం, పది లక్షల వడ్డీ లేని రుణం, క్వాటర్లలో ఉచిత ఏసి కనెక్షన్ వంటి 70కి పైగా హక్కులను సాధించి



నట్లు ఆయన వివరించారు. అనంతరం నాయకుడు సారంగపాణి మాట్లాడుతూ ప్రస్తుతం గెలిచిన సంఘాలు మెడికల్ బోర్డు నిర్వహణలో విఫలమవుతున్నాయని విమర్శించారు. కొత్త సర్క్యులర్లు తీసుకువస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, కంపెనీ లాభాలను దారి మళ్లిస్తుంటే ప్రశ్నించలేకపోతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో దుర్గం శివ, గోళెం సతీష్, యాదగిరి, రాజేష్, విశాల్, ముద్దం వెంకటేష్, మహేందర్, వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల చూపు బిజెపి వైపు

**ప్రజాపక్షం/నస్పూర్:**రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలందరూ బిజెపి వైపు చూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. మంగళవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ శ్రీరాంపూర్ జోన్ 26వ డివిజన్ సుందరయ్య కాలనీ, 3వ డివిజన్ కృష్ణ కాలనీల్లో ఆయన గడప గడపకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గత పదేళ్లు బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేయగా, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే బాటలో పయనిస్తోందని ఆరోపించారు.దేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు



జరుగుతున్నాయని రఘునాథ్ పేర్కొన్నారు. మంచిర్యాలలో బిజెపి మేయర్ అభ్యర్థి గెలిస్తే కేంద్ర ప్రభుత్వ నిధులతో నగరాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాజుల ముఖేష్ గౌడ్, సత్రం రమేష్, బరుపాటి మారుతి, రావణవేణి శ్రీనివాస్, పానుగంటి మధు, బుసారపు తిరుపతి, మహేందర్, సిరికొండ రాజు పాల్గొన్నారు.

## అచ్చెల్లి గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

**ప్రజాపక్షం / సిర్పూర్ టి:**మండలంలోని అచ్చెల్లి గ్రామ పంచాయతీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపిడిఒ సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని పెద్దబండ, న్యూ కాలనీ, రుద్రారాం ప్రాంతాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా పనులు వేగవంతం చేయాలని ఫీల్డ్ స్థాయి సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలను నిర్ణీత సమయానికి సాధించాల్సిన అవసరం ఉందని, ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని ఆయన



స్పష్టం చేశారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మైనిక, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి మహేష్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## టోల్‌ప్లాజాలో ఉచిత నేత్ర వైద్య శిబిరం




**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండల పరిధిలోని ధర్మారం టోల్‌ప్లాజా వద్ద 37వ జాతీయ రోడ్డు భద్రతా మాసంలో భాగంగా మంగుళూరు హైవేస్ ప్రైవేట్ లిమిటెడ్, లయన్స్‌క్లబ్ ఆఫ్ బోధన్ వారి సహకారంతో మంగళవారం ఉదయం 10 గం.ల నుండి సాయంత్రం 4 వరకు ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సురక్షితమైన డ్రైవింగ్, భాద్యతాయుతమైన రోడ్డు ప్రవర్తనలో మంచి దృష్టి కీలక పాత్ర పోషిస్తుందని, ప్రమాదాలను నివారించడంలో స్పష్టమైన దృష్టి ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఏఐ టీఎల్ దినేష్‌కుమార్ హన్సారియా, ఆర్ఈ రవిశంకర్, పిట్లం ఎస్సై వెంకట్‌రావుపాటిల్, పెద్దకొడప్‌గల్ ఎస్సై అరుణ్‌కుమార్, మెయింటెనెన్స్ ఐఎంఎస్ మేనేజర్ రాజ్‌కుమార్ సిగారే, మేనేజర్ అక్షయ్‌కుమార్, ఏఎంఎస్ మేనేజర్ ఖాజామొయినొద్దీన్, క్యాంపు ఇంచార్జీ హన్మంతురావు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానంతోనే ప్రాణ రక్షణ



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్:**సమాజంలో రక్తదానానికి మించిన దానం మరొకటి లేదని బిజెపి జిల్లా సీనియర్ నాయకులు డాక్టర్ కొత్తపల్లి అన్నారు. మంగళవారం కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణం సర్ సిల్క్ ప్రాంతంలోని న్యూట్రిషన్ ప్లస్ వెల్నెస్ సెంటర్ ఆధ్వర్యంలో మార్వాడి యువమంచ్, జీవన్ ధార బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన, షుగర్, బిపి పరీక్షల శిబిరం నిర్వహించారు. సుమిత్ గుప్తా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకరు ఇచ్చే రక్తం మరొకరి ప్రాణాన్ని కాపాడుతుందని, అత్యవసర సమయాల్లో రక్తం దొరకక ఇబ్బంది పడే పేద రోగులకు ఇలాంటి శిబిరాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. రక్తదానం పట్ల ఉన్న అపోహలను వీడి ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యువత సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం ద్వారా సమాజం పట్ల బాధ్యత పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాగృతి మహిళా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు నీతో సర్కార్, అనుసరఫ్, స్వాతి దుల్కర్, రేఖా జాజు, కుష్బూ లోయ, అనిత బంగ్, సంతోష్ ఆశావా, కీర్తి జాజు, లతా మంత్రి, శాంతా సోనీ, హీన, లోయ, విజయకుమార్, విజయ్ యాదవ్ పాల్గొన్నారు.

## దంత సంరక్షణ.. సంపూర్ణ ఆరోగ్యం




**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:**ప్రతినిత్యం దినచర్యలో భాగంగా నోటి శుభ్రత, దంత సంరక్షణ ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని డాక్టర్ శివకృష్ణ అన్నారు. మంగళవారం నస్పూర్ మండలంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో శ్రీకాంత్ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం నుండి సాయంత్రం వరకు సుమారు 292 మంది విద్యార్థులు ఉచిత దంత వైద్య సేవలను వినియోగించుకున్నారని తెలిపారు. దంత సమస్యలు రాకుండా ప్రతి విద్యార్థి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చికిత్స కన్నా నివారణ ఉత్తమమని, ప్రతిరోజూ ఉదయం, రాత్రి రెండు పూటలా తప్పనిసరిగా బ్రష్ చేసుకోవాలని ఆయన కోరారు. ఆరు నెలలకు ఒకసారి దంత వైద్యుడిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు, టూత్ పేస్టులు, మౌత్ వాష్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ డాక్టర్ సునీల్,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మ జాతరకు ఆహ్వానం

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** నర్మెట మండలంలోని అమ్మాపురం గ్రామ ప్రజలు అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతర మహోత్సవానికి భక్తులను సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు అమ్మాపురం గ్రామ సర్పంచ్ బోలగాని రేఖ బాపురాజు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి నర్మెట మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గోపగోని శ్రీధర్‌గౌడ్ గౌరవ అతిథిగా హాజరుకానున్నారన్నారు. జాతరను విజయవంతం చేయాలని భక్తులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సురేందర్, సీనియర్ నాయకులు రమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు రాజు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

**ప్రజాపక్షం/సిద్దిపేటఅర్బన్:** కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ అని,అర్హులైన ప్రతి పేదకుటుంబానికి ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని వర్తింప చేస్తామని సిద్దిపేట జిల్లా యూత్ కాంగ్రెస్ సెక్రెటరీ ఎర్రబోలు రాజారెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని నర్సాపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల ప్రోసిడింగ్‌లను రెండవ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో పేరు రాని అర్హులైన ప్రతి ఒక్కరికి రెండవ విడతలో న్యాయం చేస్తామన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా తమ పార్టీ అనేక పథకాలను అమలు చేస్తుందనారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామికి,సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పూజల హరికృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

## బిఆర్ఎస్ నేత కుటుంబానికి సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండలంలోని ఇటికాల పల్లి గ్రామ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దూడల శ్రీనివాస్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతిచెందగా ఆయన కుటుంబానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సహకారంతో మంజూరైన రూ.53వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం బీఆర్ఎస్ అధ్యక్షులు చంద్రారెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఆయన వెంట ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అద్యక్షుడు కనకయ్య గౌడ్, బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో కుమారుడిని చేర్పించిన తహసీల్దార్

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న సరస్వతి తన కుమారుడిని మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నాలుగవ తరగతిలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుల తల్లి సర్కార్ బడిలో ఉండే అన్ని రకాల వసతులు ఉంటాయని తెలిపారు. తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చదివించాలనే లక్ష్యంతో పాఠశాలలో చేర్పించినట్లు ఆమె చెప్పారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులు సామాజిక సేవలో అందరికీ ఆదర్శం

### మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/సిద్దిపేట :** ఆర్యవైశ్యులు సామాజిక సేవ కార్యక్రమాల్లో ముందు వరుసలో నిలుస్తారని.. గ్రామ స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయిలో వైశ్యులు చేసే సేవ కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట వాసవీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ ఎన్నో కార్యక్రమాలకు నాంది పలికింది సిద్దిపేట అన్నారు. అన్ని రకాల సేవకార్యక్రమాలు పాలుపంచుకుంటారన్నారు. గల్లీ నుండి డిల్లీ దాక సామాజిక సేవ కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ముందువరుసలో నిలుస్తారని కొనియాడారు. వ్యాపారం కోసం ఏంత కష్టపడుతారో అంతే ప్రేమతో సేవ కార్యక్రమాల్లో ముందుంటారన్నారు. అధ్యాత్మిక, దైవిక సామాజిక సేవ కార్యక్రమాల్లో మీ సేవ ఏంతో గొప్పదన్నారు. కొత్త కార్యవర్గం సామాజిక సేవలో గతంలోకంటే ఏన్నో కార్యక్రమాలు చేసి ఆదర్శంగా నిలువాలన్నారు. అందుకోసం నా సంపూర్ణ సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. క్లబ్ నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించి అభినందించారు. వాసవి క్లబ్ గవర్నర్ సముద్రాల కృష్ణమూర్తి, వాసవి క్లబ్ అధ్యక్షుడు కూర శ్రీనివాస్. ప్రధానకార్యదర్శి నాగమల్ల కిషన్, కోశాధికారి బుక్క అరుణ్, వనిత క్లబ్ అధ్యక్షులు కూర ఉమారాణి. ప్రధాన కార్యదర్శి సంధ్య. కోశాధికారి బుక్క ప్రతిభ, యూత్ క్లబ్ అధ్యక్షులు బుక్క సంతోష్,ప్రధాన కార్యదర్శి మంచాల దుర్గప్రసాద్. కోశాదికారి చింత శివకుమార్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈకార్యక్రమంలో వాసవీ క్లబ్ ప్రతినిధులు గంప శ్రీనివాస్. కొర్తివాడ రాజేందర్, కొత్త వెంకటేశ్వర్‌రావు. మాంకాల నవీన్. గంప కృష్ణమూర్తి. పుల్లురు శివకుమార్. శశాంక్,హరికిరణ్, రాజేంద్రప్రసాద్,మురంశెట్టికుమార్, కొమురవెల్లి అంజయ్య, అయిత బాలరాజేశం, యాద శ్రీనివాస్, చందా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట మున్సిపాల్టీలో ఎజెండా కాపీలు కాల్చిన కౌన్సిలర్లు



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన కాంగ్రెస్,బిజెపి కౌన్సిలర్లు

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట మున్సిపాల్టీలో నిధులు పక్కదారి పట్టిస్తున్నారని కాంగ్రెస్ కౌన్సిలర్లు సాకి బాల్‌లక్షి ఆనంద్, ముత్యాల శ్రీదేవి బుచ్చిరెడ్డి.పయ్యావుల పూర్ణిత ఎల్లం. రియాజోద్దీన్, బిజెపి కౌన్సిలర్ రాధవేణుగోపాల్‌లు, కాంగ్రెస్ నాయకుల ఆలకుంట మహేందర్‌లు ఆరోపించారు. మంగళవారం సిద్దిపేట మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం నుండి బయటకు వచ్చిన కాంగ్రెస్, బిజెపి కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలోనే ఎజెండా కాఫీలను కాల్చి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులను కులసంఘాలకు కేటాయిస్తూ నిధులకు పక్కదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ బిఆర్ఎస్ కౌన్సిలర్ సొంత వ్యవసాయ పొలానికి మున్సిపల్ నిధులతో సిసి రోడ్డు నిర్మించుకోవటం నిధుల దుర్వినియోగానికి పరాకాష్ట అన్నారు. మున్సిపల్ చైర్మన్. కమిషనర్ కుమ్మక్కై పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్ బిఆర్ఎస్ కౌన్సిలర్‌గా మాదిరిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సిద్దిపేట మున్సిపాల్టీలో జరుగుతున్న అవినీతిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని వెంటనే డిమాండ్ చేయాలన్నారు. మున్సిపల్ జరుగుతున్న అవినీతిపై రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి, డిఎంఎకు ఫిర్యాదు చేయనున్నారు.

## మన్నాన్‌పల్లి జాతరకు ఎమ్మెల్యే పల్లాకు ఆహ్వానం



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండలంలోని మన్నాన్‌పల్లిలో త్వరలో జరుగనున్న సమ్మక్క సారలమ్మ జాతర ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ మంగళవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి బీఆర్ఎస్ నేతలు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ ఈనెల 29న వస్తానని హామీ ఇచ్చారని మాజీ సర్పంచ్ తార శ్రీధర్‌గౌడ్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి వెల్లడించారు.

## రాజయ్యకు రాజకీయ సమాధి కట్టేందుకే దిగిన త్రిమూర్తులు



ఇకపై రాజయ్య కడియం జోలికొస్తే సహించేది లేదు: మారుజోడు

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** రాబోయే రోజులలో మాజీ ఎమ్మెల్యే రాజయ్యకు బీఆర్ఎస్ పార్టీలో రాజకీయ సమాధి చేయడానికి మున్సిపల్ ఎన్నికల పేరుతో త్రిమూర్తులు దిగివారి అనుచరులకు ఇంచార్జి బాధ్యతలు అప్పగించడానికి పావులు కదుపుతున్నారని, రాజయ్య ఇకనైనాకళ్లు తెరిచి బీఆర్ఎస్ పార్టీలో నీ స్థానం ఏంటో సరిచూసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్‌రెడ్డి హితవు పలికారు. మంగళవారం మండల కేంద్రంలోని రాంబాబు స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ముగ్గరు కలిసి నాలుగు రోజుల క్రితం ఘనపూర్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ముగ్గర కలిసి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని చెప్పి రాజయ్యను విస్మరించడం వెనుక ఆంతర్యం ఏమిటో వారికే తెలియాలన్నారు. ఇప్పటికైనా రాజయ్య కడియంపై, వారి కుటుంబంపై లేనిపోని నిరాధార ఆరోపణలు మానుకుని, బీఆర్ఎస్ పార్టీలో తన స్థానం ఏంటో తెలుసుకోవాలని హితవుపలికారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇప్పటికే నియోజకవర్గంలో రూ.1400 కోట్ల అభివృద్ధి నిధులు తీసుకువచ్చి స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డితో పనులు ప్రారంభోత్సవం చేశారన్నారు. నియోజకవర్గ ప్రజలకు పల్లా, ఎర్రబెల్లి, పోచంపల్లి వీళ్లంతా ఎవరో, ఏంటో బాగా తెలుసన్న విషయం ఇకనైనా గుర్తుంచుకుని మాట్లాడాలని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు మహేందర్ రెడ్డి, రాంమూర్తి, బుచ్చయ్య, శ్రవణ్, మండల అద్యక్షుడు రవి గౌడ్, నాయకులు ,సర్పంచ్‌లు వీరస్వామి, అబ్రహం, అశోక్, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ చందర్ రెడ్డి కలిసి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు సీఎం సహాయ నిధి కింద 34 మంది లబ్దిదారులకు రూ.11లక్షల 40వేల చెక్కులను లబ్దిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవిగౌడ్, నాయకులు సిద్దేష్, రమేష్, సర్పంచ్‌లు వీరస్వామి, అశోక్, అబ్రహం, నాయకులు శివకుమార్, బుచ్చయ్య, శ్రవణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మేడారంకు బస్సు సర్వీస్‌ను ప్రారంభించిన గ్రంథాలయ సంస్థ చైర్మన్

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** మండల కేంద్రం నుండి మేడారం శ్రీ సమ్మక్క సారల్మ జాతరకు వెళ్లేందుకై ఆర్టీసి బస్సు సర్వీసును మంగళవారం మండల కేంద్రంలోని ఆర్టీసి బస్టాండ్ ప్రాంగణంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు బస్సు సర్వీసులను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసి బస్సు సర్వీసులను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి డిపో మేనేజర్ స్వాతి, ఆర్టీసి సేఫ్టీ వార్డెన్ సురేందర్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు జగదీష్ చందర్‌రెడ్డి, సర్పంచ్ ఉమారాణి రాజీవ్, నాయకులు రవిగౌడ్, సిద్దేష్, రమేష్, సర్పంచ్‌లు వీరస్వామి, అశోక్, అబ్రహం, శ్రీనివాస్, నాయకులు మహేందర్‌రెడ్డి, రాంమూర్తి, బుచ్చయ్య, శ్రవణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఐదు రోజుల పని దినాలు అమలు చేయాలని బ్యాంక్ ఉద్యోగుల సమ్మె



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** బ్యాంక్ ఉద్యోగులకు వారంలో ప్రతి శనివారం సెలవు ఇవ్వాలని,బ్యాంకులకు వారంలో ఐదు రోజుల పని దినాలను అమలు చేయాలని యూనియన్ బ్యాంక్ అవార్డు ఎంప్లాయిస్ యూనియన్ సిద్దిపేట రీజియన్ రీజినల్ సెక్రెటరీ బి శ్రీనివాస్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బ్యాంకులకు ఐదు రోజుల పని దినాల అమలు కోసం యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో మంగళవారం సిద్దిపేట పట్టణంలోని పలు బ్యాంకుల ఉద్యోగులు విధులు బహిష్కరించి సమ్మె చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగ చరిత్రలో మొట్టమొదటి సారిగా బ్యాంక్ ఉద్యోగులు సింగిల్ ఎజెండాతో సమ్మె చేస్తున్నామని,వెంటనే కేంద్ర ప్రభుత్వం ఐదు రోజుల పని దినాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిజిటల్ లావాదేవీలు పెరిగినా బ్యాంక్ ఉద్యోగులు మాత్రం ఇంకా అధిక ఒత్తిడితో వారానికి ఆరో రోజులు పని చేయాల్సిన పరిస్థితి కొనసాగుతుందన్నారు. తక్షణమే బ్యాంకింగ్‌లో వారంలో ఐదు రోజుల పని దినాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు క్రాంతికుమార్, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రిడిటేషన్ ఉన్న వారికే ప్రెస్ స్టిక్కర్

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** తెలంగాణలో జర్నలిజం విలువలను కాపాడేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల సామాజిక సేవా కార్యకర్త, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగరబోయిన మహేందర్ కృతజ్ఞతలు తెలిపారు. కేవలం అధికారిక అక్రిడిటేషన్ కార్డు కలిగిన జర్నలిస్టులు మాత్రమే తమ వాహనాలపై ప్రెస్ స్టిక్కర్లను ఉపయోగించాలని సమాచారం పౌర సంబంధాల శాఖ జారీ చేసిన మెమోను ఆయన స్వాగతించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా ప్రెస్ స్టిక్కర్లు వాడుతూ జర్నలిజం ముసుగులో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. నిజమైన జర్నలిస్టులకు రక్షణ కల్పించేలా ప్రభుత్వం జీవో 252 ద్వారా సవరణలు చేయడం శుభపరిణామమన్నారు.